క్లుప్తంగా

ఇసుక కొరత తీర్చాలి



మానవపాడు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు ఇసుక కొరత తీర్చాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందించారు. ఇసుక కొరతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయినట్లు వాపోయారు. టిప్పర్ ఇసుక ఆన్‌లైన్‌లో రూ. 15వేల దాకా చెల్లించిన, నెలల గడుస్తున్నా లబ్ధిదారులకు ఇసుక అందడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఇసుక కొరతను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో మధు, శేఖర్, ప్రభాకర్, రంగన్న, భీముడు, తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కమిటీల ఎన్నిక



అయిజ: విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో వీహెచ్‌పీ ప్రఖండ, నగర కమిటీలు ఎన్నుకున్నారు. వీహెచ్‌పీ అఖండ అధ్యక్షుడిగా తిమప్ప, ఉపాధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా విక్రమ్ సింహాచారి, సహాయ కార్యదర్శిగా రాజశేఖర్, తాయప్ప ఎంపికయ్యారు. అదే విధంగా విశ్వహిందూ అయిజ నగర అధ్యక్షుడిగా బసన్నగౌడ్, ఉపాధ్యక్షుడిగా మధు, నగర కార్యదర్శిగా పరుశురాముడు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం గోస



మానవపాడు: గుక్కెడు నీటికోసం వారం రోజులుగా గోసపడుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లు లేదని మండల కేంద్రంలోని ప్రజలు బుధవారం ఎంపీడీఓ రాఘవ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామన్నారు. మండల కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎంపీడీఓ, మిషన్ భగీరథ ఏఈ తేజను నిలదీశారు. వారం రోజులుగా నీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో పరమేష్ నాయుడు, గజేంద్రరెడ్డి, జనర్దాన్‌రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



అయిజ: పట్టణంలో శాంతిభద్రతల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. బుధవారం బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషన్ ఎస్‌ఐ తరుణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా, నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. అదే విధంగా చోరీలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణాచారి, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా

ఆత్మకూర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం పట్టణంలో వార్డు అధికారులతో కార్మికులతో కలిసి స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వార్డుల్లో ఎక్కడ బడితే అక్కడ వీధి కుక్కలు ఉన్నాయని కుక్కల తరలింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 43 కుక్కలకు టీకాలు వేయించి ఇతర ప్రాంతాల్లో వదిలేసినట్లు తెలిపారు. కుక్కకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులకు సలహాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురద దారులే గతి



బురదమయంగా మల్లాపురం రహదారి

- అధ్వానంగా లింక్ రోడ్లు
- వర్షాలు కురిస్తే అంతే సంగతి
- అవస్థలు పడుతున్న రైతులు

కేటీదొడ్డి: మూరుమూల గ్రామాలకు, పంట పొలాలకు వెళ్లే దారులు బురదమయంగా మారడంతో నానా అవస్థలు పడుతున్నట్లు ఇటు రైతులు, ప్రజలు వాపోతున్నారు. లింక్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో మీటర్ల మేర బురదతో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

3 కి.మీ. బురదలో నడవాల్సిందే

కేటీదొడ్డి- కుచినెర్ల, కేటీదొడ్డి- రంగాపురం, బస్వాపురం గ్రామాలకు, గ్రామాలను ఆనుకొని పొలాలకు చేరుకోవాలంటే 3 కి.మీ. దూరం బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే దారిలో రెండు వంతెనలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను తరలించాలన్నా వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లే దారుల వెంట ఎడ్లబండి కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

లింక్ రోడ్డు నిర్మించాలి

కేటీదొడ్డి నుంచి మల్లాపురం వరకు లింక్ రోడ్డు నిర్మిస్తే తమ కష్టాలు దూరమవుతాయని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మించాలని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కష్టంగా ఉంది



మండల కేంద్ర పరిధిలోని ఉన్న చేలకు వెళ్లే దారి బురదమయంగా ఉంది. వాన కురిస్తే చాలు దారి అధ్వానంగా మారుతుంది. కనీసం యూరియా బస్తాలను చేలకు తీసుకురాలేకపోతున్నాం. పండించిన పంటను కూడా తరలించలేక పోతున్నాం

– రాజు, రైతు, కేటీదొడ్డి

రోడ్డు నిర్మించాలి



మా వ్యవసాయ పొలాలకు పోవాలంటే బురదా దారి గుండా వెళ్లాల్సి వస్తోంది. వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి అధికారులను కోరుతున్నాం. బురద దారుల్లో ప్రయాణించేటపుడు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాం.

– వీరన్న, రైతు కేటీదొడ్డి



బురదమయంగా కేటీదొడ్డి- మల్లాపురం రోడ్డు

రోడ్డుకు మరమ్మతు



మండలంలోని చెన్నిపాడు నుంచి మండల కేంద్రానికి వచ్చే రోడ్డు కోతకు గురైందని ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు బుధవారం మట్టితో కోతకు గురైన రోడ్డును పూడ్చివేశారు. ఈ నేపథ్యంలో వాహనదారులు, ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు. మానవపాడు

పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం



పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



వైద్య శిబిరానికి తరలి వచ్చిన మహిళలు

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. స్వస్త్ నారీ- స్వశక్త్ పరివార్ పేరుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన వైద్య శిబిరాల్లో భాగంగా బుధవారం వైద్యురాలు అసియానా బేగం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. మహిళలకు బీపీ, షుగర్, చర్మ వ్యాధుల, చెవి, ముక్కు, గొంతు, దంత, రక్తహీనత, స్త్రీ వ్యాధుల, క్యాన్సర్, చిన్నారులు, గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం తప్పని నిరీక్షణ



అలంపూర్ చౌరస్తాలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అలంపూర్: బస్సుల కోసం ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రత్యేక రోజుల్లో సైతం బస్సులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. అలంపూర్ చౌరస్తాలో హైదరాబాద్ రోడ్డు మార్గంలో బుధవారం బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉత్సవాల వేళ అలంపూర్‌కు బస్సులు లేకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రయాణికుల రద్దీకి అనువుగా బస్సు సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కేటీదొడ్డి: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా తరపున తలపడిన కేటీదొడ్డి జట్టు విజేతగా నిలిచినట్లు నందిన్నె ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం విజయభాస్కర్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

గట్టు: బడిఈడు కల్గిన చిన్నారులను పనుల్లో పెట్టుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి వేణుగోపాల్ హెచ్చరించారు. పౌర సంబంధాల శాఖ, మండల విద్యాధికారుల ఆధ్వర్యంలో బుధవారం ముచ్చోనిపల్లె గ్రామంలో కళాశాత ప్రదర్శన నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనులకు పంపకుండా బడికే పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు హజరత్, కేశవులు, భూపతి, కృష్ణ, రాహుల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మున్సిపల్ అభివృద్ధికి నిధుల మంజూరు

అమరచింత: మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్ల నిర్మాణాలు, డ్రెయినేజీ, పార్కులు, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలను మంత్రికి అందించినట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

సంఘ సేవ విద్యార్థుల బాధ్యత



సమాజ సేవ గురించి వివరిస్తున్న ప్రోగ్రాం అధికారి రాజు

గట్టు: సంఘ సేవ విద్యార్థుల బాధ్యతని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్‌డీ రాజు అన్నారు. మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి రాజు మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకాన్ని 1969లో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి మనిషి మరోకరికి సహకరించడం మానవతా లక్షణమన్నారు. పరస్పర సహాకారం పరోపకారమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, అయేషా, రాఘవేంద్ర, జయరాజ్, మహేష్, భరత్, సుప్రజ, సిబ్బంది మోహన్, నర్సింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని గ్రామస్తుల వినతి

గద్వాలన్యూటౌన్: గద్వాల నుంచి ఆత్మకూర్‌కు రాకపోకలు సాగించేందుకు నూతనంగా నిర్మించ తలపెట్టిన హైలెవెల్ రోడ్డు బ్రిడ్జిని కొత్తపల్లి, జూరాల మీదుగా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. బుధవారం జెడ్పీ మాజీ చైర్మన్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సరితకు ఆమె నివాసంలో వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి, జూరాల మీదుగా కాకుండా వేరే ప్రాంతంలో వంతెన నిర్మిస్తే 24 కి.మీ. దూరం అధికంగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. కొత్తపల్లి, జూరాల మీదుగా నిర్మిస్తే 10 కి.మీ దూరం మాత్రమే ఉంటుందని, నిర్మాణ వ్యయం కూడా 30 శాతం తగ్గుందన్నారు. అదేవిధంగా గద్వాల- ఆత్మకూర్ మధ్య కొత్తపలి, జూరాల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్లకు అదనంగా అవసరమయ్యే రోడ్డుకు సరిపడా భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు రైతులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి, చెనుగోనిపల్లి, మదనపల్లి, శెట్టిఆత్మకూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

ఆత్మకూర్: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు యూరియాలో సరఫరాలో విఫలమయ్యాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, జిల్లాకార్యదర్శి హనుమంతు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను పంపకుండా కేంద్రం మొండి కొర్రీలు పెడుతున్నదన్నారు. అవసరాలను ముందే గుర్తించి యూరియాను సమకూర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజు, నాయకులు కుర్మన్న, వాసరెడ్డి, కురుమూర్తి, నాగన్న, నారాయణ, వెంకటేష్, నగేష్, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



మేర్వరాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు మేర్వరాజు అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మేర్వరాజును మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలపై గ్రామస్థాయిలో వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య, వినోద్, మల్లారెడ్డి, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, గొల్ల శ్రీనివాస్‌యాదవ్, విష్ణు, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణే.. శంకరప్రాణ వల్లభే

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలు, మండపాల వద్ద భక్తులు కుంకుమార్చన పూజలు చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- మల్దకల్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, మార్కేండేయస్వామి ఆలయం, ఆదిశిలా క్షేత్రంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రత్యేక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు, వెంకటేశొట్టి, రాజు తదితరులు పాల్గొన్నారు.
- ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కోట యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని బూరెడ్డిపల్లి సవారమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి పాల్గొన్నారు.
- ఉండవెల్లి మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో సరస్వతిదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.
- శాంతినగర్‌లోని కోయిల్‌దిన్నె రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు అమ్మవారు మూడవరోజైన బుధవారం అన్నపూర్ణాదేవిగా . ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన, పల్లకీ సేవ, మహామంగళహారతి పూజలు జరిపించారు.
- ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో దుర్గామాత ధాన్యలక్ష్మీ అవతారంలో, కోదండరామస్వామి ఆలయంలో జ్ఞానసరస్వతీదేవి ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- రాజోళి మండలంలోని అంబాభవానీమాత ఆలయంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- ఇటిక్యాల మండల పరిధిలోని పెద్దదిన్నే వేంకటేశ్వరస్వామి ఆలయం, చాగాపురం భవానీ యూత్, షాబాద్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నైవేద్యాలు సమర్పించారు.



శాంతినగర్‌లో సామూహిక అర్చనలు చేస్తున్న మహిళలు



కంచుపాడులో ..



పెద్దదిన్నెలో..



బీచుపల్లిలో..



శాంతినగర్‌లో..



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో..



మల్దకల్ మార్కండేయస్వామి ఆలయంలో..



ఉండవెల్లి అయ్యప్పస్వామి ఆలయంలో..



ధరూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో ..



ధరూరు మండలం బూరెడ్డిపల్లిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండ్ల జ్యోతి